క్లుప్తంగా

దీపాదాస్ మున్షీని కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

జమ్మికుంట: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని జమ్మికుంట పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి, బండి సుధాకర్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

బేతిగల్ చర్చికి ఆర్థిక సాయం



పాస్టర్‌కు సాయం అందిస్తున్న గొట్టె గోపా

వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న చర్చికి మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు చెందిన గొట్టె గోపా రూ.10వేల ఆర్థికసాయం పాస్టర్ ఎస్.రత్నంకు అందించారు. తనతల్లి జ్ఞాపకార్థం సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టె సుధాకర్, నందయ్య, శ్యాం, రాకేశ్, ముక్క కార్తీక్, శ్రీరాం ఐలయ్య ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మానకొండూర్: మండలంలోని చెంజర్లలో అండర్-14,17 ఎస్‌జీఎఫ్ టగ్‌ఆఫ్‌వార్ పోటీలు స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్‌లో మంగళవారం జరిగాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 350మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సెక్రటరీ శ్రీనివాస్, హెచ్‌ఎం ఖురేషి, పీడీ సమ్మయ్య, గొల్లెన కుమార్, రమేశ్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

బాల్యమిత్రుల చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

మానకొండూర్‌రూరల్: మానకొండూర్‌లోని 2000-2001 బ్యాచ్ పదోతరగతికి చెందిన హుస్సేన్‌బీ కూతురు రెహాన్ కొద్ది నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న తోటి బ్యాచ్‌మిత్రులు బాలిక ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం రూ.15వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కె.రాంబాబు, కుమారస్వామి, శ్రీనివాస్, రాజు, మొగిలి, కరుణాకర్, చిరంజీవి, సంతోష్, శ్రీనివాస్, ఆంజనేయులు ఉన్నారు.

అలరించిన ఎక్స్‌పో



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

రామడుగు: రామడుగు మండలం గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి పాఠశాలలో మంగళవారం కిడ్స్‌జోన్ ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు గణితం, సైన్స్, తెలుగు, సోషల్, యోగా, ఆర్ట్ లాంటి కార్యక్రమాలపైన ప్రత్యేకంగా ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల చైర్మన్ అన్నదానం రాధాకృష్ణ, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం సుమలత, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, బేతి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఈశ్వర్‌రెడ్డిని పరామర్శించిన సంజయ్

హుజూరాబాద్: పట్టణానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు పల్కల ఈశ్వర్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. మంగళవారం బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు, సత్యశోధక్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ ఆయనను పరామర్శించారు. బండారి సదానందం, బొంగోని శ్రవణ్‌కుమార్ గౌడ్, దుస్సా సాగర్ పాల్గొన్నారు.

ఏడాదికే శిథిలావస్థకు..

- ప్రమాదకరంగా స్త్రీశక్తి, ఉపాధి హామీ భవనం
- కుంగిన ఫ్లోర్, పగుళ్లు చూపిన గోడలు
- భవనంలోకి పాములు, తేళ్లు
- మరుగుదొడ్లు నిరుపయోగం.. నీటి సరఫరా లేదు
- పట్టించుకోని అధికారులు.. మంత్రి 'పొన్నం'పైనే ఆశలు



సైదాపూర్‌లోని స్త్రీనిధి, ఉపాధి హామీ భవనం గోడలకు పగుళ్లు..



భవనంలోని గదుల్లో కుంగిన ఫ్లోర్

సైదాపూర్: సాధారణంగా ఒక భవనం నిర్మిస్తే కనీసం 30 ఏళ్ల వరకు చెక్కు చెదరదు. కానీ సైదాపూర్‌లోని స్త్రీ శక్తి, ఉపాధి హామీ భవనం నిర్మించిన ఏడాదికే శిథిలావస్థకు చేరింది. భవనం నిర్మించి ఏడేళ్లు పూర్తి కాగా.. గోడలు పగుళ్లు చూపి, ఫ్లోర్ కుంగి ప్రమాదకరంగా తయారైంది. భవనంలోకి తేళ్లు, పాములు వస్తుండగా.. అక్కడి సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. కాంట్రాక్టరు నిర్లక్ష్యం ఇందుకు కారణంగా కాగా.. నూతన ప్రభుత్వం చొరవచూపి సమస్యను పరిష్కరించాలని మండల సమాఖ్య మహిళలు కోరుతున్నారు.

రూ.32 లక్షల నిధులతో..

ఇందిరా క్రాంతి పథకం ద్వారా స్త్రీలు ఆర్థిక సాధికారత సాధించాలని ఐకేపీ, ఉపాధి హామీ విభాగాలకు కలిపి సైదాపూర్ మండల కేంద్రంలో 2011లో రూ.32లక్షల నిధులతో అప్పటి ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి మండల కాంప్లెక్స్‌లో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఐదేళ్లకాలం పనులు కొనసాగగా 2016 నవంబర్ 26న అప్పటి మంత్రి ఈటల రాజేందర్ భవనాన్ని ప్రారంభించారు. అప్పటి వరకు అద్దె భవనంలో సాగిన ఉపాధిహామీ పథకం, ఐకేపీ కార్యాలయాలు సొంత భవనంలోకి వెళ్లాయి. ఆ సంతోషం మూణ్నాళ్లు కూడా మిగల్లేదు. కాంట్రాక్టరు, ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభించిన ఏడాదికే భవనంలోని ఫ్లోర్ కుంగింది.

గోడలకు పగుళ్లు..

భవనం ప్రారంభించిన పదినెలలకే గోడలు పగుళ్లుబారాయి. ఫ్లోర్ కుంగింది. భవనానికి కిటికీలు, తలుపులు సరిగా లేవు. కిటికీల్లోంచి, ఫ్లోర్ పగుళ్ల నుంచి పాములు, తేళ్లు వస్తున్నాయని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ఐకేపీ కార్యాలయంలో వరండాతో పాటు గదుల్లో ఫ్లోర్ కుంగి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం మహిళలతో సభలు, సమావేశాలు నిర్వహించే భవనం ప్రమాదకరంగా మారిందని, ఫ్లోర్ సరిగా లేక జారి పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వసతులు కరువు

భవనంలోని ఉపాధిహామీ, ఐకేపీ కార్యాలయాలకు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేవు. ఐకేపీలో 26గ్రామ పంచాయతీల్లో 33 గ్రామైఖ్య సంఘాలు, మండలంలో 700కు పైగా స్వశక్తి మహిళా సంఘాలు ఉన్నాయి. సుమారు తొమ్మిదివేల మంది సభ్యులు కొనసాగుతున్నారు. వీరికి ప్రతీనెల ఈ కార్యాలయంలో సంఘాల ఆర్థిక లావాదేవీలపై సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు వచ్చే మహిళలు మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్డి ఉన్నా నీటి సౌకర్యం లేదని బోరు వేయాలని కోరుతున్నారు. మంచినీటి సౌకర్యం కూడా లేదని చెబుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఉన్నతాధికారులు భవనానికి మరమ్మతు చేయించాలని, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మరమ్మతు చేయాలి



స్త్రీశక్తి భవనంలో ప్రతీరోజు మహిళా సంఘాల సభ్యులకు సమావేశాలు, సంఘాల కార్యక్రమాలు కొనసాగుతాయి. ఆఫీస్‌లో అడుగు పెట్టాలంటే భయమేస్తోంది. ఎక్కడ జారి పడ్తామోనని భయమేస్తోంది. బండలు కుంగాయి. అందులో పాములు, తేళ్లు కన్పిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి భవనం మరమతు పనులు చేపట్టాలి. కనీస వసతులు కల్పించాలి.

– సమ్మ రజిత, మండల అధ్యక్షురాలు, సంతోషిమాత మండల సమాఖ్య, సైదాపూర్

బోరు ఏర్పాటు చేయాలి



కార్యాలయానికి నీటిసౌకరం లేదు. బోర్ మోటర్ ఏర్పాటు చేయాలి. నీటి సరఫరా లేకపోవడంతో మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది. ప్రతీనెలా సమావేశాలకు వచ్చిన మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయంలోని అన్ని గదుల్లో ఫ్లోర్ కుగింది. గోడలు పగుళ్లబారాయి. అధికారులు, మంత్రి స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలి.

– చెన్నబోయిన కుమారస్వామి, ఐకేపీ ఏపీఎం సైదాపూర్

పాత పెన్షన్ పునరుద్ధరించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చొప్పదండి: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మొగిలి లచ్చయ్య కోరారు. రాగంపేటలో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. బదిలీలు, ప్రమోషన్లు చేపట్టి, స్పౌజ్ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎగదండి భవిత, జిల్లా కార్యదర్శి పల్నాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాలు ధ్వంసం



చదును చేసిన ప్రకృతివనం

ఇల్లందకుంట: గత రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలను తొలగించి, గుర్తు తెలియని వ్యక్తులు భూమిని చదును చేశారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి మండలంలోని భోగంపాడు, సిరిసేడు గ్రామాల పరిధిలో చోటు చేసుకుంది. గ్రామాల శివారులో ఎర్రగుట్ట పక్కన సర్వే నంబర్ 387లో ఎకరం స్థలంలో పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. సుమారు 2000 మొక్కలు ఇక్కడ పెంచుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో సిరిసేడు, భోగంపాడు పల్లెప్రకృతి వనాల్లో ఉన్న మొక్కలు తొలగించారు. విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల కార్యదర్శులు శ్రీనివాస్, అంకూస్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పక్కనే ఉన్న మర్రివానిపల్లి పల్లె ప్రకృతివనాన్ని వదిలిపెట్టి, మిగితా రెండు గ్రామాల పల్లె ప్రకృతి వనాలను ధ్వంసంచేయడం వెనుక ఓ గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడి హస్తం ఉన్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజాధనం వృథా అయిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. మొక్కలను ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన నాయకులు



మంత్రి పొన్నంతో కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్‌రూరల్: హైదరాబాద్ సచివాలయంలో మంగళవారం బీసీ,రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సొల్లు బాబు, టీపీసీసీ సెక్రటరీ థామస్, ఖలాధేర్ రమేశ్, శ్రీనివాస్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు అందజేత




రంగసాయిపల్లిలో అక్షింతల పంపిణీ కార్యక్రమంలో రామభక్తులు



సీఐ బొల్లం రమేశ్‌కు అక్షింతలు అందిస్తూ..

రామడుగు/హుజూరాబాద్: మండలంలోని రంగసాయిపల్లిలో మంగళవారం అయోధ్య రామ మందిర అక్షింతల వితరణ వైభవంగా నిర్వహించారు. రామభక్తులు ఇంటింటా అక్షింతలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ గుర్రం దేవిక, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా నాయకులు మంచికట్ల సూర్యభాను, నాయకులు సాదు మనీందర్, కట్ట రవీందర్, శ్రీనివాసాచారి, శేఖర్, అరుణ్‌భగత్, శ్రీనివాస్, శేఖర్, ఐలయ్య పాల్గొన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని బండ అంకుస్‌వాడ, వరంగల్‌రోడ్‌లో ఇంటింటా, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణ సీఐ బొల్లం రమేశ్, ఎస్సై రాజుకు రాములోరి అక్షింతలు వితరణ చేశారు. నాయకులు గంగిశెట్టి రాజు, వొడ్నాల విజయ్, తూర్పాటి రాజు, పోతుల సంజీవ్, తిప్పబత్తిని రాజు, కొలిపాక వెంకటేశ్, ఆవుల సదయ్య, కుసుమ సమ్మయ్య పాల్గొన్నారు.

ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పోస్ట్ ఆఫీస్‌లో ఆధార్ సేవలు ప్రారంభించిన అధికారులు

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ నమోదు కేంద్రంలో ఆధార్‌కి సంబంధించిన సేవలు ప్రజలు వినియోగించుకోవాలని హెడ్ పోస్ట్‌మాస్టర్ యూ.మహేందర్ తెలిపారు. ఈ కేంద్రంలో ఆధార్ నమోదు, సవరణలు, డిమోగ్రాఫిక్, బయోమెట్రిక్ సేవలు ప్రతీరోజు అందుబాటులో ఉంటాయని వివరించారు. సెలవు రోజులు మినహా మిగితా రోజుల్లో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టాఫీసుకు చెందిన వివిధ స్థాయిల అధికారులు పాల్గొన్నారు.

ట్రస్మా మండల అధ్యక్షుడిగా పుల్లూరి సంపత్‌రావు



శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రస్మా నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట మండల ట్రస్మా అధ్యక్షుడిగా డాక్టర్ పుల్లూరి సంపత్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణంలోని లోటాస్ పాండ్ పాఠశాలలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోరెం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా ఎండపల్లి సునీల్, ప్రధాన కార్యదర్శిగా ఏనుగు రమణారెడ్డి, సహాయ కార్యదర్శిగా గూడూరి రఘుపతిరెడ్డి, కోశాధికారిగా మోతె కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మాజీ అధ్యక్షుడు ముసిపట్ల తిరుపతిరెడ్డి, అవిర్నేని సుధాకర్‌రావు, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

రామ శ్రీనివాస్ మరణం తీరని లోటు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశాలీలు

హుజూరాబాద్: తెలంగాణ ప్రాంత పద్మశాలీ టీఆర్‌పీఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ అకాల మరణం తీరనిలోటని సంఘ నాయకులు అన్నారు. ఆయన మరణానికి సంతాపంగా మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అతడి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జక్కని సంజయ్‌కుమార్, బండారి సదానందం, సబ్బని రాజేందర్, చిలకమర్రి శ్రీనివాస్, మంద భిక్షపతి, కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్, సంఘం సత్యనారాయణ, సంఘం శ్రీనివాస్, కుడికాల సాయి, పోతరాజు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ శ్రమదానం



శ్రమదానం నిర్వహిస్తున్న విద్యార్థులు

సైదాపూర్: మండలంలోని సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రమదానం చేశారు. సుమారు వంద మంది వలంటీర్లు పిచ్చిమొక్కలు తొలగించి, మైదానం చదును చేశారు. విద్యార్థులు సామాజిక సేవ అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ సత్యనారాంజేయ సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజశేఖర్, అధ్యాపకులు షకీర్, మహేందర్‌రావు, భాస్కర్‌రాజు, కృష్ణప్రసాద్, రవి, రాజశేఖర్, సుజాత, రాజు, కిరణ్ ఉన్నారు.

అధికారులు వస్తే... కుర్చీలు కూడా కరువే



తిమ్మాపూర్: కాళేశ్వరం ప్రాజెక్టు రికార్డుల స్వాధీనం కోసం ఎల్‌ఎండీ కాలనీలోని ఇరిగేషన్ కార్యాలయంలో సోదాలకు వచ్చిన విజిలెన్స్ అధికారులకు కుర్చీలు కూడా కరువయ్యాయి. దీంతో స్థానిక సిబ్బంది పక్కన ఉన్న కార్యాలయాల నుంచి, సమీపంలోని గెస్ట్‌హౌస్ నుంచి కుర్చీలు తీసుకువచ్చారు.

'ఫాతిమా షేక్ సేవలు మరువలేనివి'



హుజూరాబాద్: దేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ సేవలు మరువలేనివని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఫాతిమా షేక్ 193వ జయంతి నిర్వహించారు. 2వ వార్డు కౌన్సిలర్ బర్మావతి యాదగిరినాయక్‌తో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు ఖైరున్నీసాబేగం, టీచర్లు తేక్లమ్మ, శ్రావణిలను సన్మానించారు. మహాత్మా జ్యోతిరావు పూలే కమిటీ గౌరవ అధ్యక్షుడు మహమ్మద్ ఖాలిద్ హుస్సేన్, సభాధ్యక్షుడు ఎస్కే.జలీల్, పూలే జయంతి కమిటీ ప్రధాన కార్యదర్శి ఉప్పు శ్రీనివాస్, అంబేద్కర్ జయంతి కమిటీ గౌరవ అధ్యక్షుడు వేల్పుల రత్నం తదితరులు పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్ బదిలీ

వీణవంక: వీణవంక నాయబ్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సయ్యద్ నిజామొద్దీన్‌ను నియమిస్తూ కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుటుంబానికి తహసీల్దార్‌కు తెలియకుండా ఆయన డిజిటల్‌కీ చోరీ చేసి ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇచ్చాడు. దీనిపై తహసీల్దార్ తిరుమల్‌రావు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. దీంతో కర్ర శ్రీనివాస్‌రెడ్డిని కలెక్టర్ బదిలీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

వివేకానందుడి జయంతిని విజయవంతం చేయండి

రామడుగు: రామడుగు మండలం వెదిర గ్రామ వివేకానంద చౌరస్తాలో ఈ నెల 12న నిర్వహించే స్వామి వివేకానంద జయంతిని విజయవంతం చేయాలని జాతీయ యువజన అవార్డు గ్రహీత, నిర్వాహకుడు అలువాల విష్ణు ఒక ప్రకటనలో కోరారు. యువత, యువజన సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తరలిరావాలని సూచించారు.

నేడు మంత్రి 'పొన్నం' రాక

మానకొండూర్: మండలంలోని నిజాయితీగూడెం గ్రామంలో ఉపాధిహామీ, సీడీపీ నిధులు రూ.23లక్షలతో చేపట్టిన నూతన గ్రామ పంచాయితీ భవనం, గంగిపల్లిలో నిర్మించిన బస్టాండ్, వ్యాయామ పరికరాలను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రారంభిస్తారని అధికారులు వెల్లడించారు.

జాతర దుకాణాలకు వేలం

మానకొండూర్ రూరల్: మండలంలోని వేగురుపల్లి- నీరుకుల్ల సమ్మక్క- సారలమ్మ జాతర ఫిబ్రవరి 21నుంచి 24వరకు నిర్వహించడం జరుగుతుందని ఉత్సవకమిటీ చైర్మన్ చల్లపల్లి నర్సయ్యగౌడ్, కార్యనిర్వాహణ అధికారి తెలిపారు. ఈ జాతరలో కొబ్బరికాయలు, బెల్లం, లడ్డూ, పులిహోర, పుట్నాలు, పేలాల అమ్మకం, తదితర నిర్వహణకు ఈనెల 17న ఉదయం 11గంటలకు బహిరంగవేలం నిర్వహించబడుతుందని, ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

రామడుగు: రామడుగు మండలం దేశరాజ్‌పల్లి మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మ్యాన మురళీధర్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన వ్యక్తిగత కారణాలతోనే పార్టీకి రాజీనామా చేయడం జరిగిందని ఈ సందర్భంగా వివరించారు.

రైతుబంధు జమ చేయాలి

వీణవంక: యాసంగి సీజన్ ప్రారంభమైన ఇప్పటివరకు రైతుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదని, రైతులు పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కాసర్ల సుధాకర్ అన్నారు. మండలంలోని కొండపాక్ గ్రామంలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సీజన్ ప్రారంభంలోనే డబ్బులు రైతులఖాతాలో జమ చేసేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని పేర్కొన్నారు. కాలయాపన చేయడం తగదని, రైతుల ఇబ్బందులను గమనించాలని అన్నారు. నాట్లు పూర్తి అయ్యేలోపు ఎస్సారెస్పీ నీళ్లను విడుదల చేయాలని అధికారులను కోరారు.

ఎంపీఓ బదిలీ

హుజూరాబాద్: హుజూరాబాద్ ఎంపీఓ సిరాజ్ ఉర్ రెహమాన్ మంగళవారం పెద్దపల్లిజిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు ఆయన్ను సన్మానించారు. దళితబంధు పథకం అమలులో ఎనలేని సేవచేశారని కొనియాడారు.

మద్యం పట్టివేత

వీణవంక: మండలంలోని కిష్టంపేట గ్రామంలో దూడం నరేందర్ అక్రమంగా మద్యం అమ్ముతున్నాడనే సమాచారం మేరకు తనిఖీ చేశారు. రూ.10,420 విలువ గల మద్యం లభించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్టుషాపు నడుపుతున్నాడని పేర్కొన్నారు. మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఆలయానికి గ్రానైట్ అందజేత

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీవేణుగోపాల స్వామి ఆలయానికి రూ. లక్ష విలువైన గ్రానైట్‌ను వొల్లాల నరేష్‌కాంత్ గౌడ్ మంగళవారం అందించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నమాధవుని పవనసుత రాజు, ఉపాధ్యక్షుడు కాసు వేణుగోపాల రాజు, కార్య నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు గజ్జెల అశోక్, మొగిలిపాలెం అనిల్, కనకట్ల ఆకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899